## రోహిణిలో వాన

రుద్రభట్ల నరసింగరావు

దేశం అంతా అనావృష్టులతో బాధ పడుతూ ఉంటే నేను ఇలాటి కథావస్తువు ఎన్నుకున్నానేమిటని ఆశ్చర్యంగా ఉందా? ఇది ఇప్పటి సంగతి కాదు. మున్నటి సంగతి. దాదాపు రెండేళ్ళ కిందటి ముచ్చట. మరీ అంతగా అప్పటి మాటా కాదు. ఎలాగో చదివితే తెలుస్తుంది—చదవండి.

రోహిణీ ప్రవేశం అయి రెండు మూడు రోజులు అయిందనుకుంటాను. మొన్న అని కొందరూ, అటు మొన్న అని కొందరూ మా ఆఫీసులోనూ, హోటల్లోనూ, బజార్లలోనూ బస్సు స్టాపుల్లోనూ వాదించుకుంటూ ఉంటే నా చెవిన పడింది. వివిధ కవులు రెండేసి మూడేసి కాలాల్లో జీవించి ఉన్నట్టు చదివి చదివి ఉన్నానేమో, నాకు ఏది ఎప్పుడు, జరిగిందన్న పట్టింపు దేని విషయంలోనూ లేని వైఖరి అలవడింది. ఈ కార్తె విషయమూ అంతే. నా మట్టుకు నాకు రోహిణీ ప్రవేశం అయిందన్న వార్త సరిపోయింది.

రోహిణి గురించి తెలియని ఆంధ్రులుండరు కాని, దేశ మధ్య భాగం ఎండల గురించి తెలియని వారుండవచ్చు. నే నున్న ప్రాంతం నించి ఇటు బంగాళాఖాతం ఎంత దూరమో, అటు అరేబియా సముద్రం కూడా అంతే దూరం. ఎండలెలా ఉండాలో అలా ఉంటాయి ఇక్కడ. లేక ఎలా ఉండకూడదో అలా ఉంటాయి ఎండలు అనవచ్చు.

అది మే నెల కదా. అప్పుడే చాలా కాలం బట్టి ఎండల బాధ పడుతూనే ఉన్నాం. కాని ఈ మధ్య పది రోజుల బట్టి మరీ తీవ్రంగా ఉంది ఎండ. వడగాడ్పులు బాగా కొడుతున్నాయి.

ఆ వేళ సెలవు. ఆఫీసులో ఉండి పని చేస్తుంటే అంత తెలియదు కాని, ఇంట్లో ఉంటే మరింత బాధగా ఉంది. ఉదయమే గచ్చు కడిగించి పెందరాడే భోజనాలు చేసి ఫాను పెట్టుకుని గదిలో కటిక నేలని తలగడ పడేసుకుని పడుకున్నాను.

ఈ ఎండల లోనే తారు రోడ్లు వేసే కూలీలని తలుచుకుని మనంకూడా శ్రమ కోర్చగలగాలి కాని, పొమరిపోతులం కాకూడదు అనుకున్నాను ఒకసారి. అది నే నెప్పుడూ ఎలాగో ఒక లాగ మనస్సులో అనుకునే మాట. అలా నన్ను నేను హెచ్చరించుకుని ఆ సమయాన్ని బట్టి పుస్తకాలు బైండు చెయ్యడమో, పిల్ల లిద్దరినీ సైకిలు మీద కూర్చోపెట్టుకుని తిప్పి తీసుకు రావడమో, బుల్ బుల్ వాయించడమో, చదవడమో చేస్తుంటాను.

ఇదంతా ఇంట్లో ఉన్నప్పటి మాట. ఆఫీసులో అయితే ఎవరి ఆదర్శమూ అక్కర లేదు. ఏ ఆలోచనా అక్కర లేదు. సూపరింటెండెంట్, పి.ఏ.ల ఆదర్శమే ఆదర్శం. అంటే పని చెయ్యక పోవడం అన్న అర్థం రాలేదు కదా? దయ ఉంచి పని చెయ్యడం అన్నదే నా ఉద్దేశం అని గ్రహించండి. పని చేసే పై ఆఫీసర్లు కూడా లేకపోలేరు కదా. మా పి. ఏ. ల బృందం చాలా స్ట్రిక్టు అయిన వాళ్ళే.

ఆఫీసు సంగతి వదిలేద్దాం.

ఆవేళ సెలవు రోజు—ఇంట్లో పడుకుని ఏదైనా చేద్దామని ఆలోచించానని చెప్పాను కదా. పుస్తకం తీశాను చదవడానికి. అది ఒక దొరగారు ఇండియాలో గడిపినప్పటి జీవితం ఆధారంగా రాయబడిన నవల. ఆయనకి మన దేశంలో ఫిబ్రవరి నెలలోనే తాపం భరించలేనట్టుగా ఉండేది. గాంధీగారు అహింసా ఉద్యమం నడిపితే ఇచ్చారా స్వరాజ్యం అన్న ప్రశ్న ఒకటి ఉంది. దానికి పలువురు పలు సమాధానాలిస్తుంటారు, చూశారా? నన్నడిగితే మన దేశం ఎండలు భరించలేక ఇచ్చారనుకుంటాను.

నేను చదువుతున్న పుస్తకం అట్టలు వంకర్లు తిరిగి పోయి ఉన్నాయి. పేజీలు వేడి వేడి అప్పడాలలా ఉన్నాయి. అయినా కొంత సేపు చదివాను. ఎప్పుడో నా భార్య వచ్చి నా యోగసాధనకి అడ్డు వచ్చి పుస్తకాన్ని తీసుకుని షెల్ఫ్‌లో పెట్టేసి పొరుగింటికి వెళ్ళి పోయింది. నాలుగింటికి కాఫీలు పెట్టే వేళదాకా అక్కడ పచ్చీసు పాళీ ఆడుతూంది ఆవిడ.

ఫాను గాలిని క్రమబద్ధమైన వడగాడ్పుగా చెప్పుకోవచ్చు. నేను ఆ వేడి గాలిలోనే నెమ్మదిగా నిద్ర పోయాను.

గాఢంగా నిద్ర పట్టినందువల్ల ఎంత సేపో నిద్ర పోయినట్టు లేదు. లేచేసరికి మా ఆవిడ కాఫీలో పంచదార కలుపుతున్నట్టు గిన్నెలో చెంచా చప్పుడు వినిపించింది.

కిందటి వారం ఇదే టైముకి లేచేటప్పటికి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయి ఉంది. ఫాను కొంచెంసేపు ఆపు చేస్తేగాని బతకలే ననిపించింది అప్పుడు. అంత వేడిగా ఉంది గాలి.

అలాటిది ఈసారి లేచేటప్పటికి చల్లగా ఉంది. నిమిషానికి వెయ్యి ఘనపుటడుగుల చొప్పున మలయ సమీరమో, హిమాలయ సమీరమో అన్నట్టు సరఫరా చేస్తూంది మా ఫాను.

''ఏమిటి వింత?'' అన్నాను కాఫీ పట్టుకొచ్చిన శ్రీమతితో, నా ఒళ్ళు చూసుకుంటూ.

''మీరు బాగా నిద్ర పోయారు. మీరు అలా నిద్ర పోగానే ఎండ అలా ఉండగానే కొంత వాన పడింది. పెద్ద వాన కాదు గాని, రెండు మూడు సార్లుగా పడింది. చిన్న చిన్న వడగళ్ళు కూడా పడ్డాయి. ఇంత సేపూ పిల్లలు వాటి నేరుకోడంకోసం వాకిట్లో గెంతులు.''

''తడిసిపోయారా?'' అన్నాను పిల్లలకి వైద్య సదుపాయం కలిగించవలసిన నా ఉద్యోగాన్ని తలుచుకుంటూ.

''లేదు లెండి'' అని నా గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది మా శ్రీమతి—తప్పనిసరియైన వాటి గురించి ఆందోళన ఎందుకన్నట్టు తుంచేసి మాట్లాడడం వచ్చు ఆవిడకి.

నేను బాత్‌రూమ్‌లో మొహం కడుక్కుంటుండగానే తువ్వాలు తెచ్చి— ''కూరలు కొంచెం చౌకవుతాయి సుమండీ'' అంది. ఆవిడొక ఆశా జీవి!

''చరిత్ర పునరావృత్తం అవుతుందన్నది సత్యమే. యుద్ధాలు మళ్ళీ మళ్ళీ వస్తాయి. అంతవరకే'' అన్నాను నేను—ఆవిడ ఆ విషయమే ప్రస్తావించినట్టు. మొహం కడుక్కోవడం అయింది. ఆవిడ చేతిలోని తువ్వాలు అందుకుని తుడుచుకుంటూ—''నాగరికతలు పరిఢవిల్లి దిబ్బలయిపోతే మళ్ళీ ఎలాగో కష్టపడి మానవజాతి ముందడుగు వేస్తుంటుంది. అంతవరకే'' అంటూ కొనసాగించి—''కాని ధరలు తగ్గడంలాటి విషయాలలో మునపటి రోజులు మళ్ళీ రావు'' అని ముగించి, తువ్వాలు ఆమె భుజం మీద నిస్పృహగా పడేసినట్టు పడేశాను. ''అందుచేత, ఓ దేశవాళీ అమ్మాయీ, మై డియర్ కంట్రీ గర్ల్, అత్యాశలకి పోకు'' అని హితబోధ కూడా చేశాను.

నే నింత మాట్లాడినా మా శ్రీమతి నవ్వలేదు. ఇలాటి వాటికి ఆవిడ నవ్వదు. నా చదువూ, సామాజిక దృక్పథమూ, వాటిని బట్టి వచ్చిన హాస్య వైఖరీ ఆవిడ కంతగా లేవు. అమాయకంగా చూస్తూ అంది—

''నే నంత దూరం పోయేదాన్నిలెండి. కిలో దగ్గిరా పావలానో, అర్ధో తగ్గదా అని?''

''ఎల్లుండి దేవాదశినాడు పొద్దున్నే నువ్వు మొహం కడుక్కుని పౌడరు రాసుకుని, బొట్టు పెట్టుకుని ఏ విలేజ్ బూటికో వెళ్ళవలసి ఉన్నట్టు, రాత్రి చీర మార్చి ఏ జార్జెట్ చీరో, పాలియెస్టరో కట్టుకున్నాక'' అన్నాను.

''ధరలు తగ్గుతాయేం?'' అని నవ్వింది. ఇలాటి మాటలు బాగా తెలుస్తాయి ఆవిడకి. ''పోనీ నేను ఈ 'ఏకాదశినాడు' అలా చేసినా చేస్తాను లెండి. నా ధర్మమా అని ప్రజలయినా సంతోషిస్తారు కాస్త'' అంది.

మాకు పుట్టిన వాళ్ళు ముగ్గురు పిల్లలు. మధ్య వాడు చిన్న ఏణ్ణర్ధం బతికి పోయాడు. ఇప్పు డున్నది బాబు, ఆడపిల్ల కన్న—ఆరూ, మూడేళ్ళ వయస్సుల వాళ్ళు. చిన్నపోడంతో వీళ్ళ విలువ పెరిగింది. గారాబ మర్యాదలు ఎక్కువ చేస్తున్నాం.

అన్నాల దగ్గిర వాళ్ళు తాత్సారం చేసినా, తగువు లాడుకున్నా ఆఫీసియల్స్ క్లబ్‌లో టెన్నిస్ మేచ్ చూడడానికి వచ్చేవాళ్ళ ప్రోత్సాహకరంగా చూస్తూ

ఉంటాం మేం భార్యా భర్తలం.

నాలోకి దిగులుస్తున్నప్పుడు మా ఆవిడ అదే చేసిందని నాకు ఆ సాయంకాలం అల్లా ఆవిడ వాళ్ళ గురించి చెప్పిన కబుర్ల బట్టి తెలిసింది.

''నాకిట్లో ఏం ఉండిపోయాయో అవి వాళ్ళింట్లో ఉన్నదాన్ని నాకు రానానే పరిగెత్తుకు వచ్చాను. తీరా చూస్తే నీళ్ళున్నారు. వీళ్ళ కెంత సరదానో చెప్పలేను. తెయ్యి అని గెంతుతూ కేరింతాలు కొడు తున్నారు. వడగళ్ళు పడడం మొదలెట్టేసరికి సరేసరి—వరండా మీదకీ, నాకిట్లోకీ తెగ తిరిగారు. చిన్నదానికి పెద్దవాడు సాయం. దీని చేతికి అవెక్కడ దొరకుతాయి. వాడు తెచ్చి పాపం దీని గ్లాసులో వడేస్తూండేవాడు.''

''కన్న తిందీ?'' అనడిగాను—వడగళ్ళు తిన గలదా అనుకుంటూ.

''అయ్యో!'' అంది మా శ్రీమతి గట్టిగా. కన్న తింది అని రూఢిగా చెప్పడం అన్న మాట అది. ''తల వెనక్కివేసి, గ్లాసు మొహంమీద బోర్లించు కుని, గ్లాసు కొరుకుతూ తింటూంటే మీరు చూడవలసింది.''

''గ్లాసులో ఎక్కువ లేక అలా చేసిందేమో.''

''బోలె డున్నాయండీ.''

నేను తృప్తిపడ్డాను.

సరే, దీనంతటి ప్రభావం ఆ రాత్రికి దాఖలాగా కనబడనే కనబడింది.

కన్న అన్నానికి రాలేదు. తల్లి బతిమాలితే ఏడుపు మొదలుపెట్టింది.

''పోనీ, వూరుకో. కొంతసేపు మనం ఆగుదాం—అంతదాకా బాబుకి పెట్టు'' అన్నాను.

కన్నని ఉయ్యాలలో వేసి వచ్చి రాని పాట పాడుతూ చూశాను.

అది కొంతసేపు హిందూస్థానీ రాగాలాపన చేసి నిద్రపోయింది.

ఒక గంటకి అది అన్నానికి రాలేదు గాని, దానికి జ్వరం వచ్చింది.

వెంటనే నా తోటి ఉద్యోగి దగ్గరకి పరిగెత్తి నో ఇరవై రూపాయలు అప్పు పుచ్చుకున్నాను. మా వూళ్ళో డాక్టరుగారికి పిల్లలు లేరు. అందుచేత పిల్ల లతో పడే బాధలు ఆయనకి తెలియవు. ఆయనకి పిల్లని చూపించేముందు డబ్బుని చూపించడమే అలవరుచుకున్నాం.

డాక్టరుగారి దగ్గరనుంచి నేను భుజంమీది పిల్లతో తిరిగొచ్చేసరికి వెంకటేశ్వరస్వామి పటం ముందు మా ఆవిడ నిండుని లెంపలు వేసుకుం టూంది.

ఆవిడ భక్తికి ఆటంకం కలిగించకుండా నేను గదిలోకి వెళ్ళి కన్నని పక్కమీద బోర్లా పడుకోబెట్టి ఇంజక్షన్ నిచ్చిన చెయ్యి రాస్తూ కూర్చున్నాను.

తిరుపతికి పిల్లని తీసుకు వస్తానని ఆవిడ మొక్కుకున్నట్టు నాకు నెమ్మదిమీద తెలిసింది.

ఇది జరిగి ఎంత కాలం అయిందో మొదటే చెప్పాను గదా.

మా ఆఫీసులోనూ, చుట్టుపట్లా తిరుపతి వెళ్ళొచ్చిన వాళ్ళవల్ల తిరుపతి యాత్రలోని కష్ట సుఖాలు నేనూ, మా శ్రీమతీ తెలుసుకుంటూనే ఉన్నాం. ఎన్ని తెలుసుకున్నా, ఫలితాంశం మట్టుకు అంతగా తేలలేదు. తిరుపతికి వెళ్ళే జనం పెరిగి పోయారని కొందరంటే, యాత్రికులకి సదుపా యాలు పెరిగాయని కొందరన్నారు. సదుపాయాల దగ్గిర వుండత పేచీలు పెరిగాయని కొందరన్నారు. ధర్మ దర్శనంవల్ల ఒళ్ళు హూనం అవడం తప్ప లాభం లేదని కొందరంటే, టిక్కెట్టు పెట్టి స్వామిని దర్శించడం సంసార్లకి సాధ్యం కాని పని అని కొంద రన్నారు. తిరుమలకి వస్తే ఎక్స్‌ప్రెస్‌లు, ఎక్స్




ప్రెస్సుల్లో రిజర్వేషన్‌లు, ఎక్స్‌ప్రెస్ బస్సుల దగ్గిరనుంచి సత్రములు, కొండమీదికి బస్సులు, ప్రసాదాలు, మంగళ్ళదాకా అన్నీ తెలిశాయి. ప్రతి చోటా దారి పొడుగునా చెల్లించవలసిన ముడుపుల గురించి తెలిశాయి. క్యూలలో తొక్కిసలాటలవల్లా, బస్సులు కూలీ, ఇతర విధాలా సంభవించిన యాత్రి కుల జీవయాత్రాశ్వాసాంత కథనాలు కొన్ని విన్నాం. పేపర్లు ప్రచురించినంతమట్టుకు తెలుసుకున్నాం. దొంగతనాలు, దొపతనాల గురించి పాదాహరణంగా తెలుసుకున్నాం. చిల్లరలు లేక ఇవ్వకపోవడాలు, ఉంచేసుకుందామని ఇవ్వకపోవడాలు, మామూళ్ళు, ఇనాములు, తగులుబాటులు, దండుగలు అన్నింటి గురించిన కూలంకష పరిశోధన చేశాం. సందర్భ వశాత్తూ మా కక్కరలేనివీ కొన్ని తెలిసేవి. హుండీలో డబ్బు అవినీతిపరులకు ఎంతెంత, ఎలా కైంకర్యం అయిపోయేదీ, మన జీవిత కాలం అంతా స్వామికి నిత్య నైవేద్యం మన పేర పెట్టడానికి ఎంత చెల్లిం చాలో, స్వామివారి డబ్బు వేటి వేటికి పెట్టుబడు లుగా వెళ్ళినదీ, వెళ్ళుతున్నదీ—అలాటివి. మా పరిచి యస్థులు ఎవరో మా ద్వారా పంపించదలచి ఇచ్చిన ముడుపులు పుచ్చుకున్నాం. అక్కడినించి వారి వారికి లేవలసిన ప్రసాదాలకి ఆర్డర్లు పుచ్చుకున్నాం.

ఈ లోగా—కన్న జుత్తు జడలు కట్టినప్పుడల్లా ఒక డబ్బాలో వేసి జాగర్త చేస్తున్నాం.

ఎప్పుడో యాత్రకి వెళ్ళాలి.

ఇప్పటికైతే ఇంకా కుదరలేదు. *